# మానవత్వ పరాకాష్ట

- ఎ.సువర్ణ

వాకిటి గుమ్మంలో మనిషి నీడ కనిపించి వార్తాపత్రికలోంచే శేషగిరి గుమ్మం వైపు చూశాడు.

ఎవరో అపరిచిత విదేశీ వనిత గౌనేసుకుని బాబ్డ్ హెయిర్, ఎత్తు మడమల జోళ్లు వేసుకుని పొత్తిళ్లలో పసిబిడ్డతో నిలబడున్న అమ్మాయిని చూసి షాకయ్యాడు శేషగిరి.

"ఎవరీ విదేశీ అమ్మాయి? చేతుల్లో పసిబిడ్డతో తమింటికి వచ్చిందంటే... ఒకవేళ త్యాగూ..." అంతకు పైన ఆయనను ఆలోచించనీయకుండా, "మే ఐ కమిన్ సార్...?" అన్న ఆమెను "ఎస్... కమిన్..." అని లోపలకు వచ్చేందుకు అనుమతించాడు శేషగిరి.

ఆమె ఎవరు? ఎందుకొచ్చింది? అన్న ప్రశ్నలేవీ అడగకుండా శేషగిరి "ప్లీజ్ సిడౌన్" అని సోఫా చూపించాడు. ఆమె "థ్యాంక్స్" అని కూర్చోబోతుండగా, బయట నుంచి టాక్సీ డ్రైవరు రెండు చేతులతో రెండు పెద్ద పెద్ద సూట్‌కేసులు లోపలకి తెచ్చి పెట్టాడు. అవి చూసిన శేషగిరికి దు:ఖం ఆగలేదు. ఎంత ఆపుకుందామన్నా ఆగకుండా ఆయనలోని దు:ఖం కన్నీరుగా బయటికొచ్చింది.

"సార్... ప్రాణం లేని మీ అబ్బాయి తాలూకు సూట్‌కేసులను చూసి బాధపడే మీరు, మీ అబ్బాయి ప్రతిరూపాన్ని చూస్తే మీ దు:ఖాన్ని మరచిపోతారు" సోఫాలో కూర్చుని ఆమె అలా అన్నాకే ఆమె ఒడిలోని బిడ్డను పరీక్షగా పరిశీలించి చూశారు.

"మా అబ్బాయిని వివాహం చేసుకున్నావా అమ్మా...?" అని ఆయన అడిగిన దానికి లేదన్నట్లుగా తలాడించిన ఆమెను అదో మాదిరిగా చూశాడు శేషగిరి. అది అర్థం చేసుకున్న ఆమె "సార్... మొదట నేను చెప్పే విషయాలు వినండి. ఆ తరవాత నేను తప్పు చేశానో, రైటు చేశానో అనేది మీకే తెలుస్తుంది..." అని చెప్పడం మొదలుపెట్టింది.

"నా పేరు మిలని. నేను అమెరికాలో మిచిగన్ యూనివర్సిటీలో రీసెర్చ్ చేస్తున్నా! అదే యూనివర్సిటీలోనే మీ అబ్బాయి త్యాగరాజు రీసెర్చ్ చెయ్యడానికొచ్చాడు. ఒకే సబ్జెక్టు మీద రీసెర్చ్ చేస్తున్న మేము మంచి స్నేహితులమైనాము. హాస్టళ్లలో ఎక్కడా ఖాళీ లేక ఓ అపార్ట్‌మెంటు అద్దెకు తీసుకుని, అద్దె ఇద్దరం షేర్ చేసుకునే వాళ్లమ.

మీ అబ్బాయి ప్యూర్ వెజిటేరియన్ అవడం వల్ల వేర్వేరుగా వంటలు చేసుకునేవాళ్లం. ఒకే ఇంట్లో వున్న యౌవనంలో వున్న యువతీయువకుల మధ్య సెక్స్ సంబంధం అనివార్యం. ఆకలి, దప్పికలకు మల్లేనే సెక్స్ కూడా. వేర్వేరుగా వుండే యువతీయువకులు డేటింగ్ పేరుతో కలిసి తిరుగుతారు. సెక్స్ సంబంధాలు పెట్టుకుంటారు. మా దేశంలో దాన్ని తప్పుపట్టరు. మీ దేశంలోలా అలా పుట్టిన సంతానాన్ని అక్రమ సంతానంగా ముద్రవేసి హీనంగా చూడరు. తల్లి కని పెంచుతుందే కానీ కుంతీదేవిలా గంగపాలు చెయ్యదు."

"అమ్మో... ఈమెకు మన భారతదేశ పురాణేతిహాసాలన్నీ తెలుసునల్లే వుందే" అని మనసులోనే ఆశ్చర్యపోయారు శేషగిరి.

"పుట్టి పెరిగే ఆ సంతానాన్ని సమాజం అక్రమ సంతానం అని ముద్రవేసి అవమానపరచదు. మా శారీరక సంబంధం ఫలితంగా మీ అబ్బాయి ప్రతిరూపం నా గర్భంలో ప్రాణం పోసుకుని రూపం దిద్దుకోవడం ప్రారంభించిందని నెల తప్పిన పదిహేను రోజుల తరువాతనే నాకు తెలిసింది. నాకు బిడ్డకు జన్మనివ్వడం ఇష్టంలేదు. అందుకని ఒక వీకెండ్‌లో ఓ నర్సింగ్‌హోమ్‌లో అబార్షన్ చేయించుకునేందుకు అపాయింట్‌మెంట్ తీసుకున్నాను.

శనివారం పొద్దున నర్సింగ్ హోమ్‌కు బయలుదేరుతుండగా టెలిఫోన్ మోగింది. నిన్న సాయంత్రం ఫ్రెండింటి కెడతానని బయలుదేరిన మీ అబ్బాయి కారు యాక్సిడెంట్‌లో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడన్న వార్త ఫోన్‌లో చెప్పాడు ఆ ఫ్రెండ్.

నా మనసంతా బాధతో నిండిపోయింది. బాగా అప్‌సెట్ అయ్యాను. నర్సింగ్‌హోమ్‌కు ఫోన్ చేసి నెక్స్ట్ వీక్ వస్తానని చెప్పి ఇంట్లోనే వుండిపోయాను.

ఆ రాత్రంతా మీ అబ్బాయి ఆలోచనలే. ఆయన తను అమెరికా వచ్చే ముందర తల్లి తనకి చెప్పిన మాటలు నేను గుర్తు చేసుకున్నాను.

'వురేయ్, త్యాగూ! నువ్వా దేశం వెళ్లి, దస్... బుస్... అని ఇంగ్లీషు మాట్లాడుతూ, భుజాల వరకూ జుట్టు కత్తిరించుకుని, గౌను తొడుక్కున్న అమ్మాయిని తీసుకొచ్చి, అమ్మా... నీ కోడలంటే నేను ఒప్పుకోను' అన్న తల్లితో, 'అమ్మా... నేను అమెరికా చదువుకునేందుకు వెడుతున్నానే కానీ, పెళ్లి చేసుకునేందుకు కాద'ని చెప్పిన కొడుకుతో, 'తొందరగా తిరిగొచ్చి పెళ్లి చేసుకుని పండంటి మనుమడిని కనివ్వాలన్న తల్లి కోరిక చెప్పి, తన తల్లిదండ్రులకు తనొక్కడే సంతానం అని, తొందరగా రీసెర్చి పూర్తిచేసి ఇండియా తిరిగెళ్లి తల్లి కోరిక తీర్చాల'ని తరచూ చెప్తూ వుండేవాడు మిస్టర్ త్యాగరాజు.

'ఆ తల్లి కోరిక తీర్చడానికిప్పుడు కొడుకు బతికిలేడు. కానీ అతని ప్రతిరూపం నా గర్భంలో వున్నది. ఆ తల్లి కోరికను నేను తీర్చగలను తల్చుకుంటే' అని అనుకోగానే అబార్షన్ చేయించుకోకూడదని పది నెలలు మోసి బిడ్డకు జన్మనివ్వాలని నిశ్చయించుకున్నాను. మళ్లీ మరో కోణంలోంచి ఆలోచించాను. 'మీరు ఈ బిడ్డను మీ వారసుడేనని నమ్మి వీడిని మీరు తీసుకుంటారా' అన్న సందేహం వచ్చింది.

అందుకూ ఓ పరిష్కారాన్ని ఆలోచించే వుంచుకున్నాను. మీరా బిడ్డను మీ మనుమడిగా అంగీకరించని పక్షంలో ఆ బిడ్డను నేనే పెంచి పెద్ద చెయ్యాలని నిశ్చయించుకున్నాను."

శేషగిరికి ఆమె చెప్పేది ఎంతో థ్రిల్‌గా అనిపించింది. లోకంలో ఇంతటి గొప్ప మానవత్వం వున్న మనుష్యులున్నారా... అని పరవశించిపోతున్నాడు.

"ఈ పది నెలలు నా స్నేహితులు, బంధువులు నన్ను ఎన్నో విధాలుగా ఎగతాళి చేశారు... తిట్టారు... బుద్ధిలేని పని చేస్తున్నానన్నారు... అయినా నేనెవరి మాటలూ లెక్కచేయలేదు.

నేననుకున్నట్లుగానే మీ మనుమడిని ఈ ప్రపంచంలోకి తీసుకొచ్చాను. మీ వారసుని... మీ వంశాంకురాన్ని మీకు అప్పగించి వెళ్లాలనే వచ్చాను.

శేషగిరి మిలని ఒడిలో వున్న బిడ్డను పరీక్షగా చూశాడు. లేచి వెళ్లి బిడ్డ మొహం చూసిన శేషగిరికి ఆ మొహంలో తన బిడ్డ ఛాయలు కనిపించి ఆమె చెప్పినదంతా నిజం అని, ఆ బిడ్డ తమ వారసుడేనన్న నమ్మకం కలిగింది.

వంటింట్లో కాఫీ కలుపుతున్న పుష్పాంబకు హాలులో తన భర్తతో ఎవరో ఆడమనిషి 'దస్... బుస్...' అని ఇంగ్లీషులో మాట్లాడ్డం వినిపించి, 'నాకు తెలియని ఆ ఇంగ్లీషులో మాట్లాడే ఆడమనిషెవరబ్బా' అనుకుంటూ కాఫీ కప్పులతో హాలులోకి వచ్చిన పుష్పాంబకు అక్కడ

## అది...

ఆదిమానవునికి... ఆధునిక మానవత్వానికి
మధ్య సరిహద్దు రేఖ
బట్ట లేని ఆదితనం నుండి బట్టబయలయే
ఆధునికతనానికి రూపాంతరం
మనిషి జీవన విన్యాసానికి సహజీవన సూత్రం
నేస్తమై అలరారే నిరంతర అస్త్రం... వస్త్రం
మనిషినీ మృగాన్నీ వేరుచేసి
సిగ్గును చిగురింపజేసి, సింగారాన్ని మొగ్గలేయించింది
తడిసి ఉప్పళింపబడి, బండ దెబ్బలు తింటూ
దండానికి అతుక్కొని, ఎండకు ఎండి
వాడి ఊపిరి ప్రోది చేసుకుంటూనే
ఇస్త్రీ బరువు క్రింద నలిగి వాతలు భరిస్తూ
ముడతల్ని విడనాడి, ముతకతనాన్ని సంతరించుకొని
రంగులు వెలిసినా ముఖాన నవ్వుల్ని రంగరించుకొని
మానవతకు సజీవ సాక్షియై
ఒంటి బరువులకు తెరవేసి
చీకి... చిక్కి శల్యమై
మారుబట్టలా మారి, మూలన కుచింపబడే
అది త్యాగధనానికి నిలువెత్తు సాక్షి
ఖద్దరు... ఖాకీ... పట్టు... పాలిస్టర్...
రూపం ఏదైనా బహిర్గతాన్ని అంతర్గతం జేసింది
సిగ్గును సింగారించి... మనుగడకు ఊపిరులూది
మనిషి జీవితానికి జీవం పోసింది.

- వడలి రాధాకృష్ణ

కొడుకు అమెరికాకు వెడుతూ తీసికెళ్లిన సూట్‌కేసులు కనిపించాయి. అంతే... చేతిలోని కాఫీ కప్పులు కిందపడినాయి. పుష్పాంబ వెళ్లి ఆ సూట్‌కేసుల మీద పడి భోరున ఏడ్చింది.

శేషగిరి కంగారు పడిపోతూ భార్య దగ్గరగా వెళ్లి ఆదరణగా దగ్గరకు తీసుకుని, సోఫా దాకా నడిపించుకొచ్చి, "మిసెస్ మిలనీ... ఈమె త్యాగూస్ మదర్... మై వైఫ్..." అని పరిచయం చేశాడు.

"ఎస్... ఐ థింక్ సో..." మళ్లీ మిలని ఆమెతో, "అమ్మా... ప్రాణం లేని మీ అబ్బాయిని గుర్తుకుతెచ్చే ఆ సూట్‌కేసుల మీదపడి ఏడవకండమ్మా. మీ అబ్బాయినే చంటివాడిగా చేసి మీ దగ్గరకు తీసుకొచ్చాను..." అన్న ఆమె మాటలకు ఆశ్చర్యంగా మిలనీని చూస్తూ, 'ఈవిడేమైనా సతీ అనసూయా... త్రిమూర్తులను ఆమె పాతివ్రత్య మహిమ చేత చంటిపిల్లలుగా మార్చినట్లు, మా త్యాగుని చంటివాడుగా చేసి తీసుకురావడానికి?' అని అడుగుతున్నట్లుగా భర్తను చూసింది.

"ఓసి పిచ్చిదానా... త్యాగుని చంటివానిగా తీసుకొచ్చానని చెప్పడం అంటే, సతీ అనసూయలా మన త్యాగుని చంటివానిగా చేసి తీసుకురావడం కాదు... త్యాగు బిడ్డను...!" అని ఆయనింకా పూర్తిగా చెప్పకుండానే, "నేననుకున్నట్లుగానే దస్... బుస్...మని ఇంగ్లీషు మాట్లాడే పిల్లనే పెళ్లి చేసుకున్నాడన్నమాట..."

"పుష్పా... నేను చెప్పేది పూర్తిగా వినకుండానే నువ్వే ఏదేదో ఊహించుకుంటే ఎలా...? ఈమెను త్యాగు పెళ్లి చేసుకోలేదు..." అని మిలని చెప్పిందంతా భార్యకు వివరంగా చెప్పాడు.

అది విన్న పుష్పాంబ ఆశ్చర్యంగా బుగ్గలు నొక్కుకున్నా, గబగబా మిలనీ వద్దకెళ్లి ఆమె ఒడిలో ప్రశాంతంగా పడుకుని నిద్రపోతున్న చంటివాడి మొహంలోకి పరీక్షగా చూసిన ఆమెకు ఆ పసివాడి మొహంలో తన కుమారుని పోలికలు కనిపించి, పట్టరాని ఆనందంతో ఆమె ఒడిలోని పిల్లవానిని తన చేతుల్లోకి తీసుకుని గుండెలకు హత్తుకుని ముద్దు పెట్టుకుంది. నిద్రాభంగమైందన్న కోపంతో పసివాడు కేర్‌మంటూ ఏడిచాడు.

"ఏడవకురా కన్నా... నేను మీ నాయనమ్మను రా..." అని మనుమడిని సముదాయించింది నాయినమ్మ.

వాళ్లలా బిడ్డను చూసి ఆనందించడం మిలనీకెంతో సంతోషాన్నిచ్చింది. తన ప్రయత్నం వృథా కాలేదు.

'కిరస్థాని దాని కడుపున పుట్టిన వీడు తన మనమడేమిటని భార్య వాడిని తన మనుమడుగా అంగీకరిస్తుందా' అన్న శేషగిరికి అనుమాన నివృత్తి అయింది.

అనలావెూకు మతం, కులం, భాష అనే అనుమానాలేవీ మనసులోకి రాలేదు. ఇప్పుడామె మనసంతా ఆ చంటివాడే ఆక్రమించుకున్నాడు.

నిజంగానే త్యాగునే మళ్లీ చంటివానిగా ఆమె మార్చిందనే అనిపించింది.

"రైట్... సో... మీరీ బాబుని మీ మనుమనిగా అంగీకరించి తీసుకుని పెంచి పెద్ద చేస్తారన్నమాట..." అని మిలనీ ఇంగ్లీషులో అన్నది అర్థంకాక భర్తవైపు చూసింది. ఏమిటన్నదన్నట్లుగా శేషగిరి ఆమె చెప్పింది భార్యకు తెలుగులో తర్జుమా చేసి చెప్పాడు.

"ఆ... అలాగా... నా మనవడిని నేను పెంచి పెద్ద చెయ్యకపోతే, మరెవరు చేస్తారు..." అన్న పుష్పాంబ తన నుంచి బిడ్డను తీసుకెడుతుందా అన్నట్లుగా బిడ్డను మరింత గట్టిగా హృదయానికి హత్తుకుంది.

"ఓకే... సార్ ఐ మేకే మూవ్... మరి నేను బయలుదేరుతాను..." అన్న ఆమె, "నేనీ ఊళ్లోనే మరో నాలుగు రోజులుంటాను. మీరు మనసు మార్చుకున్నట్లయితే నాకో ఫోన్ చెయ్యండి. నేనొచ్చి నా కొడుకుని మా కంట్రీకి తీసికెళ్లిపోతాను."

"నో... నో... మీకా అవకాశమే ఇవ్వదు నా వైఫ్..." అని చెప్పి లోపలకెళ్లి ఆయన ఓ చెక్కు సంతకం పెట్టి తీసుకొచ్చి ఆమెకిస్తూ, "అమ్మా... నీకు మేమేమిస్తే నీ ఋణం తీర్చుకోగలం..."

"అమెరికన్ యువతివై వుండీ ముక్కూ మొహం తెలియని మా కోసం ఇంత గొప్ప పని చేశావు... అందుకే బ్లాంక్ చెక్కు మీద సైన్ చేశాను... నీకిష్టమైన అమౌంట్ వేసుకోమ్మా..."

అందుకామె, "నన్ను కిరాయి తల్లిని చేస్తున్నారా...? నేను డబ్బు కోసం గర్భం మొయ్యలేదు, కనలేదు... డబ్బిచ్చి నాలోని మాతృత్వాన్ని కించపరచకండి... నేనో మంచిపని చేశానన్న తృప్తిని నాకుండనియ్యండి... సరే... నేను వెడతాను..." అని మిలనీ పుష్పాంబ చేతుల్లో వున్న బాబుని ముద్దు పెట్టుకుని, వాడికి 'టాటా' చెప్పి బయలుదేరింది. వెడుతున్న మిలనీనే చూస్తూ నిలబడ్డారు ఆ దంపతులు.

మదర్‌థెరిసాను ఆమెలో చూశారు. ఆమె బాధితులకు తన చేతులతోనూ, ఆర్థికంగానూ సాయపడింది. మిలనీ చేసిన త్యాగం చాలా ఉన్నతమైనది. బలిచక్రవర్తి, దధీచులలా తన శరీరాన్నే త్యాగానికి ఉపయోగించింది.

ఇప్పుడామె ఆయన కళ్లకు మానవత్వ పరాకాష్టగా కనిపిస్తున్నది.

●

## మరణ వాంగ్మూలపు చివరి పంక్తులు

అరే, ఇక్కడో ఏరుండాలే!
మొన్నటిదాకా
అంటే, అదే... నా చిన్నప్పటిదాకా
నాతో పరుగుపందేలేసి పకపకా నవ్వేది!
ఇప్పుడేమైంది?
అన్నట్టు ఈ ఏటిగట్టున
ఎర్రటి మట్టి దిబ్బలుండేవి
పైకెక్కి తొక్కే మా పాదాల్లో
మందారాలు పూయించీ, మళ్లీ రమ్మనేవి!
ఏమైనట్టబ్బా?
గట్టు కావైపనుకొంటాను
దట్టమైన చెట్ల తోపుండేది
పిట్టల బృంద గానాలతో అక్కడ
ఉభయ సంధ్యలూ హోరెత్తేవి!
కనపడదేంటి?
అటుపక్కనే గాబోలు
కరువు కాటకాలు కాలుపెట్టకుండా
ఊరి పొలిమేరల్ని పహారా కాసే సరీసృపాల్లాగా
బండలు తిరిగిన రెండు కొండలుండేవి!
ఏవీ? అంతరించిపోయాయా?
ఇంతకూ... ఊరు... మా ఊరేది?
నాకు ఉగ్గుపాలు తాగించి ఉయ్యాలలూపిన ఊరు
గోరుముద్దలు తినిపించి గుండెల్లో జోకొట్టిన ఊరు
నేనెగిరిపోతున్నప్పుడు ఎక్కిళ్లు పెట్టిన ఊరు
ఏదీ, నా పల్లె తల్లేదీ?

... ... ...

శిథిల సమాధుల్లో ఎవరో పిచ్చి సన్యాసి
చచ్చినవాళ్ల పేర్లను అటెండెన్సు పిలుస్తూ
అచ్చు, నా చేత అక్షరాలు దిద్దించిన మా
అయ్యోరులాగే!
చితాభస్మం లాంటి చిత్తు కాగితాన్ని చేతికిచ్చి
తుప్పుపట్టిన బడిగంటను చప్పుడు చేసుకొంటూ
వెళ్లిపోయాడు!
తెరచి చూస్తే,
రైతు ఋణపత్రం మీద మృత్యువు చేసిన ఆఖరి
సాక్షి సంతకంలా
ఊరి మరణ వాంగ్మూలపు చివరి పంక్తులు
... చదువు పిట్టలూ, కొలువు గబ్బిలాలూ
నగరారణ్యాల కెగిరిపోయాక
నాగళ్లూ, కొడవళ్లూ
ట్రాక్టర్లకూ, కాంట్రాక్టర్లకూ లొంగిపోయాక
పశువులూ, శిశువులూ
ప్రీమియం ధరలతో షేర్‌మార్కెట్లలో చెల్లిపోయాక
ఏరు ఎండి ఇసుకయ్యింది
మట్టి కాలి ఇటుకయ్యింది
చెట్లు కూలి కట్టెలయినాయి
కొండ పగిలి కంకరయ్యింది
చివరికి
కరువు నొప్పినీ, కడుపు కోతనీ భరించలేని ఊరు
పురుగుమందు తాగి చచ్చిపోయింది!
వల్లకాడై మిగిలిపోయింది!!

... ... ...

నా గుండెల్ని బుల్డోజర్లతో గుద్దినట్టు
నా గొంతులో పచ్చి కాంక్రీటు కుమ్మరించినట్టు
మట్టి పొరల్లోని కలల శిలాజాలన్నీ
శిథిలమైపోతుంటే,
జీర్ణించుకోలేని బాల్య జ్ఞాపకాలన్నీ భళ్లుభళ్లున
కక్కేశా!
చుట్టుముట్టిన మార్కెట్ మొసళ్లు లాక్కుపోతుంటే,
కాలుష్య కాసారాల్లోకి కళేబరంలా కదలిపోతున్నా
తేలిపోతున్న డొల్లతనంతో!
కుళ్లిపోతున్న డాలరు ముఖంతో!!

– గోరా